క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బద్వేలు అర్బన్ : బద్వేలు సబ్ డివిజన్ పరిధిలోని డి.అగ్రహారం ఫీడర్ కింద ఉండే గుంతపల్లె, కొత్తచెరువు, డి.అగ్రహారం సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు, పాయలకుంట్ల ఫీడర్ పరిధిలోని శ్రీనివాసపురం, పి.పి.కుంట సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు శుక్రవారం ఉదయం 8-00 గంటల నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ డీఈఈ కులాయప్ప గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతనంగా నిర్మిస్తున్న బైపాస్ రోడ్డులో టవర్లు ఏర్పాటు చేసే పనుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు గమనించి అంతరాయానికి సహకరించాలని కోరారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వైఎంఆర్ కాలనీలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో గురువారం రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే)లో భాగంగా విద్యార్థులకు వైద్యాధికారి డాక్టర్ నల్లబల్లి హిమబిందు ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు చేశారు. ఎత్తు, బరువు, వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు హెల్త్ సెక్రటరీ జ్యోతి, హెడ్ టీచర్ ఖాశీం, సీఓ ఎంవీ సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు పిల్లి పుష్ప కుమారి, మల్లీశ్వరి పాల్గొన్నారు.

వార్డుల్లో కమిషనర్ పర్యటన

ప్రొద్దుటూరు : మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో గురువారం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున పర్యటించారు. మనోజీరావు వీధి, శంకర్‌రావు వీధి, కాన్పుల ఆస్పత్రి ప్రాంతాలను ఆయన పరిశీలించారు. మురికి కాలువల్లో పేరుకుపోయిన సిల్ట్‌ను పారిశుద్ధ్య కార్మికులతో తొలగించారు. కాన్పుల ఆస్పత్రి వద్ద అరుణ్ ఐస్‌క్రీం పార్లర్ వద్ద కాలువను ఆక్రమించి లెట్రిన్ పైపు డైరెక్ట్‌గా కాలువలోకి పెట్టిన ఇంటి యజమానికి దీనిని తొలగించాలని కమిషనర్ ఆదేశించారు. తొలగించకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పవర్ జనరేషన్, డిస్ట్రిబ్యూషన్‌పై శిక్షణ



శిక్షణలో వెల్లాల బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినులు

రాజుపాళెం : మండలంలోని వెల్లాలలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినులకు గురువారం ఐసెట్ స్కిల్స్ వారి సహకారంతో స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పవర్ జనరేషన్, డిస్ట్రిబ్యూషన్‌పై శిక్షణ నైపుణ్య తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ పి.తులశమ్మ, వైస్ ప్రిన్సిపాల్ విజయకుమారి మాట్లాడుతూ విద్యార్థినులకు ప్రత్యక్షంగా బోధించిన అనుభవాలతో ఉత్తమ అభ్యసనను అందించవచ్చన్నారు. విద్యతోపాటు వృత్తి విద్యపైన అవగాహన కల్పించేందుకు ఇండస్ట్రియల్ ఫీల్డ్ ట్రిప్‌కు తీసుకెళ్లినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్స్ ట్రైనర్ శివకుమారి పాల్గొన్నారు.

కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాల్సిందే


రెడ్యం వెంకటసుబ్బారెడ్డి

చాపాడు : శ్రీభాగ్ ఒప్పందం ప్రకారం కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాల్సిందేనని అసెంబ్లీలో కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు మందబలం ఉంది కదా అని తీర్మానం చేయడం శ్రీభాగ్ ఒప్పందాన్ని ఉల్లంఘించడమేనని వైఎస్సార్‌సీపీ నేత, ఏపీఎస్ ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి మండిపడ్డారు. గురువారం రెడ్యం మాట్లాడుతూ గతంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకూ కర్నూలులో న్యాయ రాజధానిని ఏర్పాటు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. హైకోర్టు బెంచి ఏర్పాటు ఆమోదయోగ్యం కాదని తేల్చిచెప్పారు. రాయలసీమ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన చంద్రబాబు ఇప్పుడు సీమకు అన్యాయం చేయడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు.

గ్రామీణ రహదారులపై టోల్‌ట్యాక్స్ వద్దు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : గ్రామీణ రహదారులపై టోల్ ట్యాక్స్ వసూలు చేయరాదని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. గురువారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో గ్రామీణ రహదారులపై జాతీయ రహదారుల తరహాలో రోడ్లను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించి, టోల్ ట్యాక్స్ వసూలు చేయాలని నిర్ణయించడం దారుణమన్నారు. చంద్రబాబు అసెంబ్లీ వేదికగా ప్రకటించడం ఉపసంహరించుకోకపోతే ఉద్యమం తప్పదన్నారు. గుంతలు పూడ్చడానికి టోల్ ట్యాక్స్ విధించాలనుకోవడం, పైలెట్ ప్రాజెక్టుగా ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో అమలు చేయాలనుకోవడం 'విజనరీ' అనిపించుకోదని ఎద్దేవా చేశారు. ఏపీలో రోడ్ల పరిస్థితి దయనీయంగా ఉందని, కూటమి అధికారంలోకొస్తే రోడ్లను బాగు చేస్తామని ఎన్నికల సందర్భంగా చంద్రబాబు హామీ ఇచ్చారని, అధికారం చేపట్టాక రహదారుల గుంతలు పూడ్చడానికి నిధులు లేవని చెప్పడం విచారకరమన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎంవి సుబ్బారెడ్డి, కేసీ బాదుల్లా పాల్గొన్నారు.

నీటి వృథా.. నిర్లక్ష్యపు వ్యథ

- బ్రహ్మం సాగర్ కుడి కాలువకు లీకులు
- ఎన్నికల కోడ్‌తో ఆగిన మరమ్మతు పనులు
- ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు కావొస్తున్న పట్టించుకోని పాలకులు


సాగర్ కుడికాలువ ద్వారా వృథాగా అవుతున్న నీరు

బ్రహ్మంగారిమఠం : తెలుగుగంగలో అంతర్భాగమైన బ్రహ్మంసాగర్ కుడికాలువ ద్వారా అధికంగా నీరు వృథాగా వెళుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సాగర్‌కు రెండు కాలువలు ఉండగా, కుడికాలువ తూముకు సరిగా షెట్టర్లు కూర్చోక పోవడంతో నీరు వృథాగా పోతుంది. ప్రస్తుతం సాగర్‌లో 8టీఎంసీ నీరు ఉంది. ఇంకా సాగర్‌కు కృష్ణాజలాలు వస్తున్నాయి. ఈ తరుణంలో రెండు కాలువలకు ఉన్న షెట్టర్లు సరిగా పనిచేయకపోవడంతో ఎడమ కాలువ షెట్టర్‌ను గత ప్రభుత్వం నిధులు కేటాయించి మరమ్మతులు చేయించారు. కుడికాలువ తూముకు షెట్టరు రిపేరు చేయించేలా అధికారులు ప్రయత్నించగా అంతలో ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిచిపోయాయి. సాగర్‌కు అప్పటిలో సరిగా నీరు రాకపోవడంతో లీకులు కనిపించలేదు. ప్రస్తుతం సాగర్‌కు నీరు చేరుతుండడంతో లీకులు అధికంగా ఉన్నాయి. కుడికాలువ కింద బి.మఠం మండలంలో కొన్ని గ్రామాలు, అట్లూరు, గోపవరం మండాలకు చెందిన కొన్నిగ్రామాల రైతులకు సాగునీరు అందుతాయి. ప్రస్తుతం కుడికాలువ నీరు అధికంగా రావడంతో బి.మఠం మండలంలోని నాగిశెట్టిపల్లె చెరువు అలుగు పారుతుంది. చెరువుకు ఎప్పుడు ఎలాంటి ముంపు వస్తుందోనని ఆయకట్టు రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతానికి ఆ కాలువకు నీరు పెద్దగా అవసరం లేకపోయినా లీకవుతున్న నీరు అధికంగా వస్తుండడంతో కొంతమంది రైతులు ఆవేదన చెందుతున్నారు.

సాగర్ లీకులను అరికట్టాలి


బ్రహ్మంసాగర్ కుడికాలు ద్వారా అధికంగా లీకు వెళుతున్న నీటిని ప్రభుత్వం తక్షణం స్పందించి నిలువపుదల చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రెండు తూముల గేట్లు రిపేరుకు నిధులు విడుదల చేసింది. ఒక తూము గేటు రిపేరు చేయగానే అంతలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. ప్రభుత్వం మారింది. ప్రస్తుత ప్రభుత్వం ఇంత వరకు ఎలాంటి పరిశీలన చేయకపోవడంతో నీరు వృథాగా వెళుతుంది. వెంటనే లీకు అవుతున్న చోట్ల మరమ్మతులు చేపట్టి నీటి సరైన రీతిలో వినియోగించాలి.

- చీలేకాంపల్లె వీరనారాయణరెడ్డి, ఎంపీపీ, బి.మఠం

ప్రభుత్వం ప్రాజెక్టులను పరిశీలించాలి


ప్రస్తుత ప్రభుత్వం ప్రజలకు సరైన పాలన అందించకపోగా ప్రతిపక్ష నాయకులపై తప్పుడు కేసులు పెట్టే పనిలో ఉన్నారు. సాగర్ ఆయకట్టుదారుల సమస్యలు పరిష్కరించలేకపోతున్నారు. సాగర్‌కు నీరు చేరుతుండటంతో లీకులు బయటపడుతున్నాయి. వాటిని సరిచేయడానికి ప్రస్తుత పాలకులు సరిగా స్పందించలేదు. నీటి వృథాను అరికట్టేందుకు యుద్ధప్రతిపదికన పనులు చేపట్టాలి.

- పోచంరెడ్డి పాలరామిరెడ్డి మండల రైతు సంఘం నాయకుడు, బి.మఠం

ఇంటి నిర్మాణాలకు ప్లాన్ అప్రూవల్ తప్పనిసరి


రాధాకృష్ణనగర్ సమీపంలో సందు రస్తాను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలో నిర్మించే ఇంటి నిర్మాణాలకు ప్లాన్ అప్రూవల్ తప్పనిసరిగా పొంది ఉండాలని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి తెలిపారు. పట్టణంలోని రాధాకృష్ణనగర్ సమీపంలో సందు రస్తా ఆక్రమించి ఇంటి నిర్మాణం చేపడుతున్నారని వచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం ఆయన సంబంధిత స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాన్ అప్రూవల్ పొందకుండా ఇంటి నిర్మాణాలు చేపడితే వాటిని తొలగిస్తామని హెచ్చరించారు. సందు రస్తాలను, దొడ్డిరస్తాలను ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కొంత మంది ప్లాన్ వేయించుకుని అదే ప్లాన్ అప్రూవల్‌గా భావిస్తున్నారని, ప్లాన్ అప్రూవల్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని పురపాలక సంఘం ద్వారా అప్రూవల్ కాపీ తీసుకుంటేనే చెల్లుబాటు అవుతుందని తెలిపారు. డ్రైనేజీలపైన, రోడ్లపైన దుకాణాల పేర్లతో కూడిన ఫ్లెక్సీలు, బోర్డులు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ ప్రణాళిక అధికారి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం


అయ్యప్పస్వామి గ్రామోత్సవంలో భక్తులు


అయ్యప్పస్వామి పల్లకీ సేవలో అయ్యప్ప భక్తులు

పులివెందుల రూరల్ : మండలంలోని కొత్తపల్లిలో గురువారం అయ్యప్పస్వామి గ్రామోత్సవాన్ని గురుస్వాములు వెంకటరామిరెడ్డి, శ్రీనివాసులురెడ్డిల ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం గ్రామస్తుల సహకారంతో అయ్యప్ప భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామోత్సవం సందర్భంగా అయ్యప్పస్వామి దగ్గర లడ్డూ వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటలో నల్లగొండవారిపల్లె గ్రామానికి చెందిన దేవిరెడ్డి పరమేష్ రూ.40 వేలకు పాడి దక్కించుకున్నాడు. సాయంత్రం కోలాటాలు, డప్పు వాయిదాల మధ్య దీప కాంతుల నడుమ గ్రామోత్సవం నిర్వహించారు.

పులివెందుల టౌన్ : పట్టణంలోని చిన్నరంగాపురం గ్రామ సమీపంలోని శ్రీహరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయంలో గురువారం రాత్రి గురుస్వామి వెంకట్రామిరెడ్డి అయ్యప్పస్వామి పల్లకీ సేవ వైభవంగా నిర్వహించారు. అయ్యప్పమాల ధరించిన భక్తులు అయ్యప్పస్వామి పల్లకీని ఎత్తుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అయ్యప్ప శరణుఘోష మధ్య పల్లకీ సేవ నిర్వహించారు. అనంతరం ఆలయంలో తాళాల భజన, పడిపాట, హరిహరాసనం చేపట్టారు. భక్తులకు అల్పాహార బిక్ష ఏర్పాటు చేశారు.

భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి



ఆర్డీఓ కార్యాలయ ఏవోకు వినతిపత్రం సమర్పిస్తున్న సీపీఎం నాయకులు

బద్వేలు అర్బన్ : పట్టణంలోని శివాలయం గుడి సమీపంలోని కుంటను ఆక్రమించి పునాదులు నిర్మిస్తున్న భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం పట్టణ నాయకులు చిన్ని తెలిపారు. గురువారం స్థానిక ఆర్డీఓ కార్యాలయ ఏవో ఉదయ భారతికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. శివాలయం సమీపంలోని కుంటను ఆక్రమించి యథేచ్ఛగా పునాదులు నిర్మించి లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నా వారిపైన ఇరిగేషన్ అధికారులు గాని, మున్సిపల్, దేవదాయశాఖ అధికారులు గాని చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శివాలయం కుంట ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ నాయకులు పాల్గొన్నారు.

విద్యాశాఖలో అసంబద్ధ విధానాలకు స్వస్తి పలకాలి

కడప ఎడ్యుకేషన్ : విద్యాశాఖలో అసంబద్ధ విధానాలకు రాష్ట్ర ప్రభుత్వం స్వస్తి పలకాలని ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.రామాంజనేయులు అన్నారు. గురువారం కడపలోని ఎస్టీఎఫ్ జిల్లా కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల పని వేళలు పెంచడం శాస్త్రీయ విధానానికి, మనో విశ్లేషణ సిద్ధాంతానికి వ్యతిరేకమన్నారు. దేశంలో విద్యలో అగ్రస్థానంలో ఉన్న కేరళలో ఉదయం 9-10 నిమిషాల నుంచి సాయంత్రం 3 గంటల వరకు కొన్ని పాఠశాలలు, 10 గంటల నుంచి 4 గంటల వరకు పాఠశాలలు నిర్వహిస్తున్నారన్నారు. విరామ సమయాన్ని తీస్తే అన్ని పాఠశాల గరిష్ఠ పనివేళలు ఐదు గంటలు మాత్రమేనన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ పాఠశాలల వేళలు యథావిధిగా కొనసాగించాలన్నారు.

మైలవరం దక్షిణ కాలువకు గండి


దక్షిణ కాలువకు గండి పడటంతో వృథాగాపోతున్న నీరు

జమ్మలమడుగు : మైలవరం దక్షిణ కాలువకు గండ్లు వేయడంతో నీరంతా పంట పొలాల్లోకి చేరుతోందని పొన్నతోట, నర్సోజి కొట్టాల గ్రామానికి చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూ డురోజుల క్రితం దప్పిర్ల-నర్సోజి కొట్టా గ్రామాల మధ్యలో ఉన్న మైలవరం దక్షిణ కాలవకు ఉన్న గోడలను గుర్తుతెలియని వ్యక్తులు పూర్తిగా తొలగించడంతో నీరంతా పంట పొలాల్లోకి వెళ్లిపోతుంది. అటువైపు 70 ఎకరాల పంట పొలాలు ఉన్నాయని రైతులు సంబంధిత అధికారలకు తెలిపారు. స్పందించిన మైలవరం డీఈ కృష్ణమూర్తి మాట్లాడుతూ వీలైనంత త్వరగా మరమ్మతుపనులు చేసి నీరు వృథాకాకుండా చేస్తామన్నారు. దీనికి రైతులు సహకరించాలన్నారు.

పోషణ లోపంతో పశువులకు వ్యాధులు


మినరల్ మిక్చర్‌ను అందుకుంటున్న పాడి రైతులు

చాపాడు : మండల పరిధిలోని వెదురూరు గ్రామంలో గురువారం ప్రొద్దుటూరు పశు వైద్య కళాశాల, స్థానిక పశు వైద్యాధికారి డా.మహమ్మద్ గౌస్ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి మాట్లాడుతూ పశువుల పాక పరిశుభ్రంగా లేకపోతే గర్భకోశ సమస్యలు వస్తాయన్నారు. పోషణ లోపం వలన వ్యాధులు అధికమై రైతులు తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితులు తలెత్తుతాయన్నారు. ఈ శిబిరంలో వివిధ గర్భకోశ సమస్యలతో ఇబ్బంది పడుతున్న 120 పశువులు, జీవాలు, కోళ్లకు చికిత్స అందించారు. రైతులకు మినరల్ మిక్చర్, కాల్షియం టానిక్ మందులను అందించారు. పశు వైద్యుల సూచనలను పాడిరైతులు పాటించాలని తెలియజేశారు. కార్యక్రమంలో పశు వైద్య కళాశాల సిబ్బంది డా.ఇందిర, డా.జ్యోతి, డా.విజయక్‌కుమార్, డా.విద్యాసాగర్, డా.సాయికృష్ణ, డా.సాయి గునరంజన్, పశు వైద్య సిబ్బంది చలపతి, లక్ష్మీనారాయణ, అమర్నాథ్, విష్ణుప్రియ, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు కొంగల సాయం

ఖరీఫ్, రబీ సీజన్‌లలో రైతులు సాగు చేసిన వివిధ పంటల్లో కొంగలు రైతులకు సాయం చేస్తున్నాయి. మినుము, శనగ పంటల్లో పురుగుల ఉధృతి ఎక్కువగా ఉండటంతో రైతులు వేలాది రూపాయలు ఖర్చు చేసి పిచికారీ చేస్తున్నారు. అయినా ఫలితం లేకుండా పోతోంది. ఈ క్రమంలో పలు రకాల పంటల్లో కొంగలకు ఆహారం దొరకడంతో పాటు రైతులకు మేలును చేకూర్చుతున్నాయి.

– రాజుపాళెం


తొండలదిన్నె సమీపంలో మినుము పంటలో పురుగులను తింటున్న కొంగలు

ప్రశ్నించే అలవాటు నేర్చుకోవాలి

కడప ఎడ్యుకేషన్ : విద్యార్థి దశ నుంచే ప్రశ్నించే అలవాటు నేర్చుకోవాలని జన విజ్ఞాన వేదిక కార్యదర్శి బాల బయన్న అన్నారు. గురువారం కడప నగరంలోని శివ శివాని ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో విద్యార్థులకు జేవీవీ ఆధ్వర్యంలో ఇంద్రజాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జేవీవీ నగర ఉపాధ్యక్షులు అబ్దుల్ రాయల్ కరీముల్లా, పాఠశాల కరస్పాండెంట్ రమణి, జన విజ్ఞాన వేదిక మహిళ విభాగ నాయకురాలు అరుణమ్మ, వెంకటేశ్వర్లు, కిషోర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇక జిల్లా ఆస్పత్రిలోనే క్యాన్సర్ నిర్ధారణ

- ఐపీహెచ్ ల్యాబ్‌లో ఏర్పాటు
- రూ.70 లక్షలతో ఇమ్యునోహిస్టో కెమిస్ట్రీ యంత్రం
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిధుల కేటాయింపు


ప్రొద్దుటూరులోని జిల్లా ప్రభుత్వాసుపత్రి

ప్రొద్దుటూరు క్రైం : క్యాన్సర్.. ఈ వ్యాధి పేరు వింటే చాలు కాళ్లు, చేతులు వణికి పోతాయి. ఈ వ్యాధిని గుర్తించిన నాటి నుంచి చికిత్స పూర్తయ్యే వరకు నరక యాతన అనుభవించాలి. చికిత్స తర్వాత కూడా ఎన్నో సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. తిరిగి ఆరోగ్యవంతులు కావాలంటే ఎంత సమయం పడుతుందో కూడా ఎవరూ చెప్పలేని పరిస్థితి. కాన్సర్ మహమ్మారి ఎంతో మంది ప్రాణాలను బలితీసుకుంటుంది. రొమ్ము, ఊపిరితిత్తులు, చర్మం, గొంతు.. ఇలా శరీరంలోని వివిధ అవయవాలకు ఈ వ్యాధి సోకుతుంది. మన దేశంలో క్యాన్సర్ వ్యాధి, దాని లక్షణాల గురించి ఇప్పటికీ చాలా మందికి అవగాహన లేదు. ముదిరిన దశలో వ్యాధిని గుర్తించడం వల్ల పరిస్థితి చేజారిపోతుంది. కొన్ని లక్షణాలను బట్టి క్యాన్సర్ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించడానికి వీలుంది. శరీరంలో మనకు తెలియకుండానే కణతులు (గడ్డలు) ఏర్పడుతుంటాయి. వాటిలో కొన్ని గడ్డలు వేగంగా పెరగడం, నొప్పిని కలిగించడంతో పాటు వ్యాధి బారిన పడితే వైద్యులను సంప్రదించాల్సి వస్తుంది. స్త్రీలలో రొమ్ము, గర్భాశయం, ఊపరితిత్తులు, కిడ్నీ తదితర చోట్ల అనుమానాస్పద గడ్డలు ఏర్పడితే పరీక్షలు చేయించాల్సి వస్తుంది. గడ్డలో కొంత భాగాన్ని తీసివేసి క్యాన్సర్ కణాలను పరీక్షించడానికి ల్యాబ్‌కు పంపిస్తారు. ఇందులో క్యాన్సర్ అనుమాన లక్షణాలున్నట్లు రిపోర్టు వస్తే అది ఎలాంటి క్యాన్సర్ అనేది ఇమ్యునోహిస్టోకెమిస్ట్రీ పరీక్షల ద్వారా తెలుసుకోవచ్చు.

సత్ఫలితాలు ఇస్తున్న నాటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ నిర్ణయాలు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాలు నేడు సత్ఫలితాలను ఇస్తున్నాయి. గత ప్రభుత్వంలో 2023న జిల్లా ఆస్పత్రిలో ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబ్ (ఐపీహెచ్‌ఎల్)ను ఏర్పాటు చేశారు. ఇందులో అన్ని రకాల పరీక్షలతోపాటు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను చేయనున్నట్లు వైద్యాధికారులు తెలిపారు. నాటి నుంచి అన్ని రకాల ల్యాబ్ పరీక్షలన్నీ జరుగుతుండేవి. నాడు ప్రభుత్వం ఐహెచ్‌సీ మిషన్ కోసం సుమారు రూ.68 లక్షలను కేటాయించింది. ఈ క్రమంలో వైద్యాధికారులు ఐహెచ్‌సీ మిషన్‌ను వారం రోజుల క్రితం జిల్లా ఆస్పత్రిలో అమర్చారు. ఇక్కడి ల్యాబ్ సిబ్బందికి శిక్షణ ఇచ్చిన అనంతరం క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు. పేద, మధ్య తరగతి ప్రజలకు ఇమ్యునోహిస్టోకెమిస్ట్రీ పరీక్షలు ఎంతగానో ఉపయోగపడతాయని ప్రజలు భావిస్తున్నారు.

• ముక్క పరీక్ష కూడా ఖరీదైందే

ముక్క పరీక్ష చేసేందుకు ప్రైవేట్ వైద్యులు సుమారు రూ. 4-5 వేల వరకు వసూలు చేస్తారు. ఈ పరీక్షలో క్యాన్సర్ ఉన్నట్లు నిర్ధారణ అయితే వైద్యుల సూచన మేరకు పూర్తి స్థాయి నిర్ధారణ, చికిత్స కోసం కర్నూలు, తిరుపతి, హైదరాబాద్ లాంటి నగరాలకు వెళ్లాల్సి వస్తుంది. అయితే ఇప్పుడు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల కోసం దూర ప్రాంతాలకు వెవెళ్లాల్సిన అవసరం లేదు. ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రిలో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.


జిల్లా ఆస్పత్రిలోని క్యాన్సర్ నిర్ధారణ చేసే ఐహెచ్‌సీ ల్యాబ్

అడ్వాన్స్ డ్ టెక్నాలజీతో కూడిన ఐహెచ్‌సీ(ఇమ్యునోహిస్టోకెమిస్ట్రీ) మిషన్‌ను ఐపీహెచ్ ల్యాబ్‌కు కేటాయించారు.

• ఇమ్యునోహిస్టోకెమిస్ట్రీతో క్యాన్సర్ కారకం నిర్ధారణ

ఇమ్యునోహిస్టోకెమిస్ట్రీ (ఐహెచ్‌సీ) అనేది ప్రయోగశాలలో నిర్వహించబడే రోగనిర్ధారణ సాంకేతికత. ఐహెచ్‌సీ కొన్ని రకాల క్యాన్సర్‌లను నిర్ధారించడంలో ప్రత్యేకంగా ఉపయోగడుతుంది. క్యాన్సర్ ఎక్కడ మొదలైంది, క్యాన్సర్ కారకం, ఇది నెమ్మదిగా లేదా వేగంగా పెరిగే అవకాశం ఉందా, ఏ స్టేజీలో ఉంది.. ఇలా పూర్తి స్థాయిలో తెలుసుకొని చికిత్సను చేయించుకునేందుకు సహాయపడుతుంది. పీహెచ్‌సీ, అర్బన్‌హెల్త్ సెంటర్‌లకు వచ్చిన క్యాన్సర్ అనుమానాస్పద లక్షణాలున్న కేసుల స్లైడ్‌లను జిల్లా ఆస్పత్రికి పంపిస్తారు. ఐహెచ్‌సీ మిషన్ ద్వారా రోజుకు 30 మంది కణజాల నమూనాలను పరీక్షించే సౌకర్యం ఉందని జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్‌బాబు తెలిపారు. నాలుగు గంటల్లో ఫలితం తెలుసుకోవచ్చన్నారు.


క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేసే ఇమ్యునోహిస్టోకెమిస్ట్రీ మిషన్

క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు ఇక సులభతరం


ఇమ్యునోహిస్టోకెమిస్ట్రీ మిషన్‌తో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు ఇక సులభతరం కానున్నాయి. జిల్లాలో మొదట ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రిలోనే ఐహెచ్‌సీ మిషన్‌ను ప్రభుత్వం కేటాయించింది. ఇక్కడి ఐపీహెచ్ ల్యాబ్‌లో తొందరలోనే క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు ప్రారంభిస్తాం.

- డాక్టర్ ఆనంద్‌బాబు, జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్, ప్రొద్దుటూరు

రోజుకు 30 టెస్టులు


ఐహెచ్‌సీ మిషన్‌లో రోజుకు 30 పరీక్షలు చేసే సౌకర్యం ఉంది. ఒక్కో బ్యాచ్‌కు 10 నమూనాల పరీక్షలు చేయొచ్చు. నాలుగు గంటల వ్యవధిలో రిపోర్టు వస్తుంది. ఐహెచ్‌సీలో ఎలాంటి క్యాన్సర్ కారకం అనేది తెలుసుకోవచ్చు. తద్వారా పూర్తి స్థాయి చికిత్స చేయించుకోవడానికి సులభతరం అవుతుంది.

- డాక్టర్ కే గోపాల్, పెథాలజిస్టు, జిల్లా ఆస్పత్రి, ప్రొద్దుటూరు